



# మావారు తరతరాల సాహితీ వారధి



దాదాపు అయిదు దశాబ్దాల క్రిందటి మాట. తెలుగులో మహా రచయితలు ఉన్నా, బెంగాలీ రచయితలు విజృంభిస్తున్న రోజులవి. అప్పుడు వెలిశాడో రచయిత. తర్వాత అతను డాక్టరుగా కూడా ఎంతో ప్రఖ్యాతుడయ్యాడు. ఆయనే ఆంధ్రా శరత్ డాక్టర్ కొమ్మూరి వేణుగోపాలరావు. తన పదిహేడవయేటనే ఈ రోజుకీ మర్చిపోలేని 'పెంకుటిల్లు' అనే గొప్ప నవలను రాసారాయన. మధ్య తరగతి జీవితాల్లోని సంఘర్షణలను వెలికి తీసి మన ముందుంచారు. తొలి నవల 'పెంకుటిల్లు'కే కేంద్ర సాహిత్య అకాడమి అవార్డునందుకున్నారు. ఆయన కలం నుంచి జాలువారిన 'హౌస్‌సర్జన్' ఎందర్నో డాక్టర్లగా తయారు చేసింది. తర్వాత రోజుల్లో ప్రేమనక్షత్రం, ప్రేమ కాంతి రాసి 'ప్రేమ గోపాలరావు' అయ్యారు. ఇంకా ఎన్నో ఎన్నెన్నో అద్భుతమైన నవలలు, కథలు మనకందించిన కీర్తి శేషులు డాక్టర్ కొమ్మూరి వేణుగోపాలరావు సతీమణి శ్రీమతి కొమ్మూరి అహల్యాదేవి గారి జ్ఞాపకాలు మీకోసం!!


**- కొమ్మూరి అహల్యాదేవి**

## అప్పటికే ఆయన రచయిత

మా తండ్రి గారు సత్యవోలు శివరావు, అమ్మ రమణమ్మ. మా తల్లిదండ్రులకు మొత్తం పద్నాలుగు మంది సంతానం. ఆడవాళ్ళల్లో అయిదవదాన్ని నేను. కాకినాడలో మా నాన్నగారు గవర్నమెంటు డాక్టరుగా పనిచేసేవారు. మా అక్కయ్యలందరికీ పెళ్ళిళ్ళు అయ్యాయి. అప్పట్లో పెళ్ళి చూపులు కూడా పెద్దగా ఉండేవి కావు. పెద్దవాళ్ళే నిర్ణయించేవారు. ఒకరోజు మా అప్పగారు (మా నాన్న గార్ని అలానే పిలిచేవాళ్ళం) నన్ను పిలిచి "అహల్యా నిన్ను చేసుకోవడానికి విజయవాడ నుంచి సంబంధం వచ్చింది. అబ్బాయి ఇక్కడే రంగరాయ మెడికల్ కాలేజీలో చదువుతున్నాడు. సన్నగా పొడుగ్గా ఉన్నాడు. నాకు నచ్చాడు. చూస్తావా?" అని అడిగారు. చూద్దామనుకున్నాను గాని, అడిగే ధైర్యం లేదు. "అబ్బాయి నాన్నగారు కూడా డాక్టరే! పేరు డాక్టర్ కొమ్మూరి సాంబశివరావు గారు" అని కూడా అన్నారు. ఒక డాక్టరు కుటుంబం నుంచి ఇంకో డాక్టరు కుటుంబంలోకి వెళుతున్నానన్నమాట! వెంటనే ఒప్పుకున్నాను. అప్పటికే ఆయన రచయిత అని తెలియదు. మా బంధువుల్లో ఎవరో గుర్తు లేదు కాని "నేనా అబ్బాయిని చూశాను. బెంగాలీ రచయిత శరత్‌బాబు పోలికలున్నాయి" అన్నారు.

## ఇవ్వాళ వంట తిందామా, త్రాగుదామా!


పెళ్ళయిన తర్వాత కాకినాడలో విడిగా కాపురం పెట్టించారు మా పెద్దవాళ్ళు. వారు ఇంకా చదువుకుంటున్నారు. విజయవాడ నుంచి వచ్చే డబ్బులు సరిపోయేవి కావు. నవభారత్ ప్రకాశరావు గారు వారి రచనలు పుస్తకాలుగా ప్రచురించేవారు. ప్రకాశరావు గారు మాత్రం నెలకి కొంత డబ్బులు పంపించేవారు. అలా మేం సర్దుకునేవాళ్లం. నాకు సరిగ్గా వంట చెయ్యటం వచ్చేది కాదు అప్పట్లో. కాలేజీ నుంచి వచ్చి 'ఇవ్వాళ వంట తిందామా, త్రాగుదామా' అనేవారు. ఏడుపొచ్చేది. తర్వాత వంటలో ప్రావీణ్యం సంపాదించాను. అప్పట్నుంచి నా వంటను బాగా మెచ్చుకునేవారు. ఆయన హౌస్‌సర్జన్ పూర్తయ్యేసరికి మా పిల్లలు ముగ్గురూ పుట్టేశారు. మా మూడవవాడు పుట్టిన తర్వాతేననుకుంటా ఆయన 'హౌస్‌సర్జన్' నవల వ్రాశారు.



భర్త కొమ్మూరి వేణుగోపాలరావుతో...

## తరానికి తరానికి మధ్య వారధిలా ఉండేవారు

ఆయనకోసం ఎవరెవరో వస్తుండేవాళ్ళు. సమరంగారు, తెన్నేటి హేమలత, మంజుశ్రీ గారు, కె.వి.కృష్ణకుమారి, నేరెళ్ళ వేణుమాధవ్ గారు ఇంకా ఎవరెవరో. ఎవరైనా సాహితీ ప్రియులు, తోటి రచయితలు వస్తే తెల్లవార్లు మాట్లాడుకుంటూ కూర్చునే వాళ్ళు. తెన్నేటి హేమలత గారు నన్ను కూడా బలవంతంగా వాళ్ళ గోష్ఠిలో కూర్చోబెట్టేది. ఆ రోజుల్లో రచయితల మధ్య చాలా ఆరోగ్యమైన వాతావరణం ఉండేది. అదే సందడి ఆయన మరణించేవరకూ ఉంది. ఎంతమంది రచయితలు కొత్తవాళ్ళొచ్చినా ఆయన మాత్రం ఎప్పుడూ వెనక్కి తగ్గిపోలేదు. తరానికి, తరానికి మధ్య వారధిలా ఉండేవారు. అందుక్కారణం తనతోటి పెద్దవాళ్ళనే కాకుండా, తనకంటే బాగా వయస్సులో చిన్నవాళ్ళతో కూడా స్నేహం చేసేవారు. మా పిల్లల స్నేహితులు ఆయన స్నేహితులు ఒకరే! అందుకే ఆయన ఎప్పుడూ సాహిత్యంలో వెనుకబడిపోవటమంటూ జరగలేదు. ఆయన కలం ఆగిపోలేదు.



కుటుంబ సభ్యులతో...

## గొలుసు నవల వ్రాశారు

మేము విజయవాడకు వచ్చేశాం. పురాణం సుబ్రహ్మణ్యం గారు వారి భార్య సీత గారు, గొల్లపూడి మారుతీరావు గారు, పురాణం సూర్య ప్రకాశరావు గారు, వీరాజీ, హిత్తశ్రీ గారు తరచూ మా ఇంటికి వస్తూ ఉండేవాళ్ళు. బాగా అపేక్షగా ఉండేవారు. ఆ స్నేహంతోనే మా వారు, పురాణం సుబ్రహ్మణ్యం గారు, గొల్లపూడి మారుతీరావు గారు 'ఇడియట్' అనే గొలుసు నవల వ్రాశారు.

## ఒక రోజు రాయకపోయినా చచ్చిపోయినట్టు ఉంటుంది

విజయవాడలో ప్రాక్టీసు పెట్టిన తర్వాత డాక్టరుగా ఆయన

## నచ్చినవి

**కథ :** మరమనిషి (డా.కొమ్మూరి వేణుగోపాలరావు)
**నవల :** కాలాతీత వ్యక్తులు (శారద)
**కవి :** ఆరుద్ర
**పాట :** నిదురపోరా తమ్ముడా (సంతానం)
**గాయకుడు :** ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం
**గాయని :** పి. సుశీల
**దైవం :** షిర్డీ సాయిబాబా
**వ్యాపకం :** పాటలు వినడం
**ప్రదేశం :** మంత్రాలయం

బాగా బిజీ అయిపోయారు. వృత్తిని, ప్రవృత్తిని దైవంగా భావించేవారు. ఉదయం నాలుగున్నరకి లేచి ఎనిమిదింటి దాకా వ్రాసేవారు. మళ్ళీ మధ్యాహ్నం భోజనం చేసి కాసేపు పడుకుని లేచి ఒక గంటసేపు రాసేవారు. మళ్ళీ రాత్రి ఇంటికి వచ్చిన తర్వాత కూడా ఒక గంట. నేనే ఎప్పుడైనా కొన్నాళ్ళు రచనలు ఆపెయ్యొచ్చుగా అంటే, ''ఒక రోజు రాయకపోయినా చచ్చిపోయి నట్టు ఉంటుంది'' అనేవారు. ఒకసారి ఆయన రెండు కళ్ళకి కాట్రాక్ట్ ఆపరేషన్ జరిగింది. అదే సమయంలో ఒక వారపత్రికలో సీరియల్ వ్రాస్తున్నారు. మధ్యలో ఆగిపోకూడదు. ఆయన చెబుతుంటే నేను వ్రాసేదాన్ని. ఒకేసారి నాలుగు పత్రికలకి నాలుగు సీరియల్స్ ఏ వారానికి ఆ వారం రాసి పంపించే వారు. ఆ నాలుగు నవలలు బాగా పాఠకాదరణ పొందాయి. నాకు ఓ ప్రక్క ఆశ్చర్యంగా ఉండేది, ఓ ప్రక్క బాధగా ఉండేది, అంత శ్రమ పడుతున్నందుకు. చివరిదాకా ఆ పద్ధతిని అలాగే కొనసాగించారాయన.

### ఆయన అలిగారంటే..

నాకు గుర్తున్నంత వరకు ఆయన పిల్లల్ని తిట్టిగాని, దండించడం గాని చెయ్యలేదు. అడిగిన వాళ్ళకి లేదనకుండా తనకి అసాధ్యమైనవాటికి కూడా మాట ఇచ్చి ఇబ్బంది పడేవాళ్ళు. తర్వాత చాలా పశ్చాత్తాప పడేవాళ్ళు. సున్ని తమైన వాళ్ళకే కోపం తొందరగా వస్తుంది. ఎక్కడికైనా వెళ్ళినా, వారి మర్యాదకి భంగం కలిగినా, గుర్తించకపోయినా బాగా బాధపడిపోయేవారు. ఆయన అలి గారంటే చిన్నపిల్లలు మారాం చేస్తే ఎలా గారాబం చేస్తామో అలా బ్రతిమాలి చల్లబర్చాల్సి వచ్చేది. తర్వాత్తర్వాత జీవితంలో ఎన్నో ఆటుపోట్లు వచ్చాయి. అన్నిటికీ తట్టుకుని మాకు కూడా జీవితం పట్ల ఉత్తేజం కలిగించేవారు. ''సక్సెస్‌ని ఎలా ఎంజాయ్ చేశామో, ఫెయిల్యూర్స్‌ని కూడా అలానే స్వీకరిం చాలి. ఎందుకంటే ఆ రెండూ తాత్కాలికమైనవే కాబట్టి'' అనేవారు.

### రచయితగా ఓడిపోవడం ఇష్టం లేదు

ఆయన అనుభవాన్నంతా చివరి రోజుల్లో 'ఆలోచన ఒక యజ్ఞం' అనే పుస్త కంలో రాశారు. రచనల ద్వారా సమాజానికి ఎంతో కొంత ఉపయోగం వుండా లంటారు. తను రాసిన 'ఒకే రక్తం ఒకే మనుష్యులు' చదవి అప్పట్లో చాలా మంది మేనరికాలు చేసుకోవడం మానేశారు. చెప్పుకుంటూ పోతే చాలా రచ నలు ఉన్నాయి. కాని, సాహిత్యంలో అనూహ్యమైన మార్పులొచ్చి కొత్త పుంతలు తొక్కింది. కాలంతో పాటు తను కూడా మారిపోయి అయన కూడా కొత్త ఒరవడిలోకి అడుగు పెట్టారు. ఆ అడుగుల మార్పు ఆయన్ని చాలా బాధ పెట్టింది. ఎందుకలా మథన పడుతూ రాయడం అని అడిగితే రచయితగా ఓడి పోవడం నాకిష్టం లేదు అనేవారు. అలాంటప్పుడు ఓడిపోతూ ఓటమిని ఒప్పు కోని చిన్నపిల్లాడి మంకుతనం కనబడేది.

### ఆ ఆనందం ఇప్పటికీ నేను మర్చిపోలేను


మధుర జ్ఞాపకాలు ఆయనతో చాలా ఉన్నాయి. ఎన్ని అని చెప్పగలను? ఆయనతో మాట్లాడిన వాళ్ళు ఆయన్ని ఒక 'నడిచే గ్రంథాలయం' అనేవారు. జీవితాన్ని అన్ని కోణాల్లోంచి విశ్లేషించి చెప్పేవారు. విజయవాడ బుక్ ఎగ్జిబి షన్‌కి ప్రతి ఏటా వెళ్ళే వాళ్ళం. కాని, ఆయన రాసిన దాదాపు యాభై నవలల్లో ఒకటో రెండో కనబడేవి. ఇది చూసి తట్టుకోలేకపోయే వారు. నాకు తెలిసి ఆయన పబ్లిషర్స్ దగ్గరకు వెళ్ళి తనవి తిరిగి ప్రచురించమని అడిగేవారు కాదు. ఒకసారి పిల్లల్ని చూడడానికి అమెరికా వెళ్ళాం. అక్కడ హ్యూస్టన్‌లో అమ్మకా నికి ఆయన రచనల్ని పెట్టారు. అప్పుడు ఆయన కళ్ళల్లో ఆనందం నేనిప్పటికీ మర్చిపోలేను.

### ఏ భార్యకైనా ఇంతకంటే ఏం కావాలి?

ఆయన ఉన్నట్టుండి ఈ లోకాన్ని విడిచి పోవడమే పెద్ద విషాదం. ఎటు వంటి సమాచారం లేకుండా హఠాత్తుగా వెళ్ళిపోవడం, ఉన్నవాళ్ళకి మర్చిపో లేని ఓ చేదు జ్ఞాపకం. రచయితగా, ఒక డాక్టరుగా ఒక వెలుగు వెలిగారు. ఎన్నో సన్మానాలు, సత్కారాలు అందుకున్నారు. వారితో పాటు నన్నూ గౌరవించారు. ఏ భార్యకైనా ఇంతకంటే ఏం కావాలి?

### మూడవ కొడుకు కథలు వ్రాస్తుంటాడు

నా ముగ్గురు పిల్లల్లో పెద్దవాళ్ళు రాజా, శివ, కోడళ్ళు అమెరికాలో స్థిరప



గొల్లపూడి మారుతీరావుతో
కొమ్మూరి వేణుగోపాలరావు

డ్డారు. రెండేళ్ళకోసారి మనవడు, మనవరాళ్ళని చూడ్డానికి వెళుతుంటాను. ప్రస్తుతం నా మూడవ కొడుకు, కోడలు, నేనూ ఉంటున్నాం. నా మూడవ కొడుకు రవికిరణ్ కూడా కథలు వ్రాస్తుంటాడు. ఈ మధ్యే నవ్య వారపత్రికలో వాడు రాసిన 'సౌందర్యం' సీరియల్‌గా వచ్చింది.

### కథలు వ్రాయడం దేవుడిచ్చిన వరం

ఇప్పుడొస్తున్న కథల గురించి ఏం చెప్పను? వార పత్రికలు చూస్తున్నాను. కొత్త రచయితలు బాగా వ్రాస్తున్నారు. సామాజిక స్పృహ వారి రచనల్లో కనబ డుతోంది. భాష మీద పట్టు ఇంకా సాధించాలి. కథలు వ్రాయడం దేవుడిచ్చిన వరం. అది ఒకరు నేర్పిస్తే వచ్చేది కాదు. మంచి రచనలు చెయ్యాలంటే ఎక్కు వగా పుస్తకాలు చదవాలి. ప్రపంచాన్ని అర్థం చేసుకోవాలి. నవ్య వారపత్రిక నిర్వహిస్తున్న ఈ శీర్షిక నిజంగా అభినందనీయం. పాత తరం కథకుల జీవిత విశేషాలను చదువుతుంటే ఇప్పుడు రాస్తున్న రచయితలకి స్ఫూర్తిగా ఉంటుంది.

### దీనికి తల్లిదండ్రులదే బాధ్యత

ఇప్పటి యువతకి అప్పటి రచయితల పేర్లు తెలియవు. మంచి సాహి త్యాన్ని చదివే అదృష్టం కోల్పోతున్నారు. కారణం తెలుగు భాషకు ప్రాముఖ్యత తగ్గించి వేరే ఇతర భాషలపై మక్కువ చూపిస్తున్నారు. చదువుల్లో ముందుంటు న్నారు. కానీ, తెలుగును నేర్చుకోవట్లేదు. దీనికి తల్లిదండ్రులే బాధ్యత వహిం చాలి. మాతృభాషను మరిపించకండి. దయచేసి మాతృభాషను బ్రతికించండి.

**–రమ**

నాకు నచ్చిన
మా వారి కథ

# తల్లీ-పిల్లా

- డా. కొమ్మూరి వేణుగోపాలరావు

**పిల్లను - ఆరునెలలు దాటని పసిదాన్ని - చివరిసారిగా మనసారా ముద్దు పెట్టుకుందా తల్లి. గుండె కద్దుకుని ఏడ్చింది. మనసులో దీవించింది. వదల్లేక వదల్లేక వదిలింది. నడిరోడ్డు మీద ఒక ప్రక్కగా, పసిదాని వళ్ళు నొప్పి పుడుతుందేమోనని బాధ పట్టుకుందామెకు. కట్టుకున్న చింపిరి పేలికల చీరలోంచి ఒక ముక్క చింపింది. దాన్ని రోడ్డుమీద పరచి పిల్లను జాగ్రత్తగా పడుకోపెట్టింది. పిల్ల యిదంతా చూడటం లేదు. ఎప్పుడో నిద్రపోయిందది. నిద్రలో నవ్వుతోందెందుకు? తనని చూసేనా? తల్లి ఊహ అది.**

దూరంగా ఎవరో వస్తున్న చప్పుడు అస్పష్టంగా వినిపించింది. తన పొరపాటు తెలిసివచ్చింది తల్లికి. పిల్లమీద ప్రేమకొద్దీ ఇంకా ఇక్కడే ఉంటే ఎలా? తన ఆశ ఏమైపోవాలి? అప్పుడప్పుడే వ్యాపిస్తున్న వెల్తుర్లో పసిదాన్ని ఆఖరుసారిగా చూసుకుంది. చిన్నగా కదిలి ప్రక్కనున్న పార్కులోకి వెళ్ళిపోయింది. పార్కులోంచి మరీ దూరంగా, పసిది తనకు కనిపించనంత దూరంగా వెళ్ళిపోలేదు. రోడ్డు ఒక మాదిరిగా కనిపించేలా వున్న గుబురుగా ఉన్న ఒక మొక్క చాటుగా దాక్కుని కూర్చుంది. అక్కణ్ణుంచి పిల్ల కనిపిస్తూనే ఉంది, ఆకుల సందుల్లోంచి, ప్రహరీగోడ చువ్వల్లోంచి అస్పష్టంగా.

ఏడ్చింది యింకా. తన కూతురు, తన పిల్ల, తనకు మొదటగా పుట్టిన బంగారు తల్లి. ఎలా దాన్ని వదిలేయటం? తనకు చేతులెలా వచ్చాయి? తన హృదయం పాషాణం. తన చేతులు యినుపవి, అందుకే ఏడ్చింది, ఏమీ చేతగాక.

ఏడుస్తుంది తన పిల్లను చేజేతులా వదిలేయాల్సి వచ్చినందుకు. కాని చేసేదేముంది లేకపోతే. తన దగ్గర పెట్టుకుని ఎలా కష్టపెడుతుంది? తను అనుభవించే బాధలు ఆ పసిదానికి కూడా ఎలా పంచుతుంది? అది తన కూతురు... బంగారు తల్లి. దాని రంగు బంగారు వన్నె. మొహంలో రాజకళ. తనలాంటి అసమర్ధురాలు. అప్రాచ్యురాలు, అర్భకురాలు ఎలా పెంచుతుంది? పెంచగలిగిన సామర్థ్యం తనకేదీ?

అసలు గొప్పింట్లో పుట్టవలసిన పిల్ల అది. రాజభోగాలు అనుభవించాల్సిన పిల్ల అది. ఖర్మం కాలి తన కడుపున పుట్టింది. దాని తప్పా అది పుట్టటం? తన తప్పు అంతకన్నా కాదు. అయితే చూస్తూ చూస్తూ ఎలా దాన్ని బాధల పాలు చేయటం? అందుకే.... అందుకే....

అతను.... తన మొగుడు ఏం చెప్పాడు? ఇప్పుడు లేడు. చచ్చిపోయాడు. తిండి లేకే చచ్చిపోయాడు. చచ్చిపోతూ తనని కావలించుకున్నాడు. ఏడ్చాడు. 'ఒసేవ్, నేను పోతున్నానే! పసిదాని భారమంతా నీదే! దాన్ని మనలాగా కష్టాలు పడనియ్యకు. ఏ జన్మలోనో మనం చేసుకున్న పుణ్యం వల్ల అది పుట్టింది. మనకి దేవత. దాన్ని ఏం చేస్తావో, నీ శక్తి, నీ యిష్టం. పోతున్నా' అంటూ పోయాడు. దానికప్పుడు నాలుగు నెలలు.

అతను పోయి రెండు నెలలయింది. తనకి యీ పెద్దభారం అంటగట్టిపోయాడు. తను గొప్పగా, అంత యిదిగా ఎలాపెంచుతుంది? అదేమైనా ఆలోచించాడా? ఉహూ - పోయేవాళ్ళకి మతులుండవు. తమకు చేతకాని వన్నీ యింకోరి మీద రుద్దిపోతారు. ఈ రెండు నెలలూ దాన్ని ఎలా పెంచింది? రాజభోగాలు అనుభవింపజేయటం ఎవరితరం? అతను బ్రతికి వున్నన్నాళ్ళూ చేసిన పనేమిటి? అడుక్కున్నాడు. తనూ అదే! అయితే తన కోర్కె ఎలా తీరటం? ఆలోచించింది. తన ప్రేమని చంపేసుకుంటే! ఎవడో డబ్బు గలవాడికి దాన్ని అర్పించేస్తే? తను కుళ్ళనీ, చావనీ! అది సుఖపడుతుంది. తనకదే చాలు!

కాని డబ్బు గలవాడికి దాన్ని యివ్వటం ఎలాగ? తన స్థితి చూస్తూ యెవడు పుచ్చుకుంటాడు? ఒకటే ఉపాయం.

అదే యిప్పుడు చేసింది. డబ్బు వుండి పిల్లలు లేనివాళ్ళు ఎందరు లేరు? వాళ్ళెవరైనా చూస్తారు. తీసుకుపోతారు. దైవప్రసాదమని మురిసి పోతారు. పెంచుకుంటారు. అదే పదివేలు!

కళ్ళ నీళ్ళు తుడుచుకుంది. ఇద్దరు ముగ్గురు అప్పుడే అటు నుంచిపోయారు. అయితే రోడ్డు ప్రక్కగా పడి వున్న పిల్లను వాళ్ళు చూడలేదు.

యింకా ఆత్రంగా రోడ్డుకేసి చూడసాగింది. దూరంగా ఎవరో వస్తున్న చప్పుడు. హృదయం ఝుల్లుమన్నది. మొన్న అది... ఆ హృదయం లేని రాకాసి ఏం చేసింది? తనకి కొడుకు పుట్టగానే చేతులు వెనక్కి విరిచేసింది. కాళ్ళు బాగా సాగదీసేసింది. చూస్తుంటే తనకే కళ్ళు తిరిగాయి. తన భయం చూసి నవ్విందది. పైగా ''లేకపోతే ఎలా గడవటం'' అనేసింది. దానికి యిద్దరు కూతుళ్ళు. యిద్దరు కొడుకులు. పెద్దకూతురు తప్ప మిగిలిన అంతా అంతే. పెద్దది! అన్నీ సరిగా వుండీ ఏం లాభం? శీలం? ఛీఛీ?

తన కూతురు! రాణి. అటువంటివేమీ చూడరాదు. వినకూడదు. దానికి దంతా యెందుకు పడుతుంది. ఏ శ్రీమంతులింట్లోనో వెండి కంచంలో అన్నం తినేస్తూ హాయిగా....

ఒక్కసారిగా ఆలోచన్లు తెంచి వేసుకుంది. చూస్తే అక్కడో మనిషి! పసిదాని దగ్గర నిలబడి వున్నాడు. దాని వంక తీక్షణంగా చూస్తున్నాడు. ఆ మనిషి వంక పరకాయించి చూసింది. ఊహూ, తనకన్న ఎక్కువే, కాని ఊహించుకున్న వారిలో ఎన్నోవంతు? థూ! వీళ్ళ సంగతి తనకు తెలుసు. తమకన్నా కష్టాలు. పొద్దున్నే యింట్లోంచి బయలుదేరి ఎక్కడో కూచుని ఏమిటేమిటో రాస్తాడు. తమకెవరూ అధికారులు లేరు. వాళ్ళకుంటారట! తప్పు వస్తే చీవాట్లు పెడతారట. బ్రతికుండగా నాన్న చెప్పేవాడు. వాళ్ళ బ్రతుకులు తమకన్నా కనాకష్టాలు. ఈ మనిషి అటువంటి రకం. ఎందు కట్లా ముందుకు వంగుతాడు? చేతులు జాపుతాడేం? తీసుకుంటే... ఎలాగ? ఎలాగ?

వేగంగా కొట్టుకుంటున్న గుండెతో, అదురుతున్న కళ్ళతో ఆరాటంగా చూసింది. కాని ఆ మనిషి పిల్లని తీసుకోలేదు. ఒక క్షణం తటపటాయించి ఆగిపోయి వెనక్కి తిరిగి వెళ్ళిపోయాడు. 'అమ్మయ్య' అనుకుంది.

రోడ్డు మీద రద్దీ యింకా సరిగా ప్రారంభం కాలేదు. అప్పుడప్పుడూ ఒకళ్ళిద్దరు వచ్చిపోతున్నారు. పది నిమిషాల వరకూ పసిదాని వంక మరెవరూ చూడలేదు. ఆరాటం హెచ్చిపోయింది తల్లికి.

'అదిగో అదిగో' అనుకుంది చటుక్కున. ఒకాయన – లంబోదర విగ్రహం – వస్తున్నాడు. పిల్లవంక చూశాడు. బాగా దగ్గరకు వచ్చి మొహంలో మొహం పెట్టి చూడసాగాడు.

సిల్కులాల్చీ, పంచె, చేతికి వాచీ, మెళ్ళో గొలుసూ ఆయన గొప్పతనానికి మచ్చుతునకలు. పార్కులోంచి తదేకదీక్షగా చూస్తున్న తల్లి యివన్నీ పసిగట్టింది. ఆయన ఎంత డబ్బున్నవాడో! ఓ పెద్ద మేడ, మేడ నిండా షోకులు, షికార్లకి కారు... పసిది ఆయన చేతుల్లో పడితే! ఓహ్! బలే!

చూసింది. ఏమిటి? తీసుకుంటున్నాడా? ఆయనకు పిల్లల్లేకుండా ఉండకూడదూ? ఏమిటది? అమాంతంగా దాన్ని ఎత్తుకున్నాడు. ఆ పాల బుగ్గలమీద బొర్రమీసాలు తగిలేటట్లు ముద్దుపెట్టుకుంటున్నాడు. పిచ్చి తల్లికి గుచ్చుకోదూ? కాని నిజంగా ఆయన తీసుకెళ్తే! భగవాన్, నీకు వెయ్యి దణ్ణాలు.

ఆయన అలా ఎత్తుకునే, పిల్లను హృదయానికి హత్తుకుని నాలుగడుగులు వేశాడు. తల్లి ఆనందంతో కళ్లు మూసుకుంది. దీవించింది. 'నువ్వు రాజభోగాలు అనుభవించు తల్లీ, వెండి కంచంలో బువ్వ తిను. గొప్పవాళ్ళ బట్టలు కట్టుకో. యింకా యింకా...'


కళ్ళు తెరిచింది. అదేమిటి? ఆయన ఆగిపోయాడు. ఒకసారి నలువైపులా చూశాడు. ఇంకోసారి పిల్లదాన్ని ముద్దు పెట్టుకున్నాడు. అయిదు నిమిషాలు తటస్తంగా నిలబడిపోయాడు. ఏం చెయ్యాలి? తీసుకునేదా? వద్దా? అనేది ఆయన కళ్ళల్లో స్పష్టంగా కనిపించింది.

రెపరెపలాడుతున్న కళ్ళతో భయంగా, ఆత్రంగా చూసింది తల్లి. దింపివేస్తున్నాడు. ఏమనుకుంటున్నాడో తనకు తెలీదు. ఎలా తెలుస్తుంది? ఏడ్చింది లోపల్లోపల. ఆయన వెళ్ళిపోతున్నాడు. ఏం? ఆ అనుమాన మెందుకు? పిల్లదానికేం తక్కువయింది?

చరచరా పార్కులోంచి లేచి వెళ్ళి ఆయన కాళ్ళమీద పడి పిల్లను తీసుకోమని ప్రార్థిద్దామనుకుంది. కాని ఎలా సంభవం? తను చెప్పినంత మాత్రం చేత ఆయన అలా చేస్తాడని ఏమిటి నమ్మకం?

వెళ్ళిపోయాడాయన, పిల్లని పడుకోబెట్టి. దానివంక అలాగే చూస్తూ విడవలేక విడవలేక వెళ్ళిపోయాడు. తల్లి కళ్ళ క్రింద వున్న మొక్క ఆకులు తడిసిపోయాయి.

ఇంకెవరైనా వస్తారేమో? ఎందుకు రాకూడదూ? తనకి అదృష్టం వుంటే భాగ్యవంతులకేం కొదవ?



సాధ్యమైనంత దూరం దృష్టి సారించి చూచింది. ఇద్దరు వస్తున్నారు ఈసారి. మామూలు మనుష్యులు. పిల్ల వున్న వైపే నడుస్తున్నారు. ఒకడు చూశాడు అందులో. ఆగిపోయి ప్రక్క వాడికి కూడా చూపించాడు. ఇద్దరూ పిల్లని సమీపించి ముట్టుకోలేదు. కొంచెం దూరంగా నిలబడే తర్కవితర్కాలు మొదలు పెట్టారు.

''ఎలా మారిపోయిందో కాలం. ఎవరో తల్లి – హృదయం లేనిది, కన్నబిడ్డని యిలా వదిలేసి పారిపోవటానికి మనస్సెలా వొప్పిందో''

''ఎవరికి పుట్టిన పిల్లో యిది''

''ఎవరికో ఏమిటి? ఒక ఆడదానికి''.

''పిల్లలు ఆడదానికే పుడతారన్న సంగతి నాక్కూడా తెలుసు. నా ప్రశ్నేమిటంటే మొగుడికి పుట్టినట్లయితే యిలా వదులకోవడం యెందుకు సంభవిస్తుంది''

''నిజం నిజం. యెవరితోనో రంకు సాగించి యిలా అఘోరించటం యెన్ని చూడటల్లా పత్రికల్లో''.

''పిల్ల ఎలా ముద్దొస్తుందో చూడు! ఆ తల్లికి చేతులెట్టా ఒప్పాయో అసలు''.

''మనకెందుకు? మనదారిని మనం పోదాం. ఇక్కడుంటే ప్రమాదం కూడాను.''

వెళ్ళిపోయారు. తల్లి నిట్టూర్చింది. యెవరూ పిల్లను తీసుకోరా? ఉన్నకొద్దీ ఎండ ఎక్కువౌతోంది. పసిది బాధపడదూ? ఏం చెయ్యటం?

ఇంకో పదిహేను నిమిషాలు గడిచాయి. ఉహు పసిదానికి డబ్బుగల వాళ్ళ యింట్లో పెరిగే యోగ్యత లేదా? యెవరూ తీసుకోరేం? చూడకుండా పోతారేం?

పిల్లకు కళ్ళల్లో ఎండ ప్రవేశించి నిద్ర చెడగొట్టింది. తల్లి చూసేటప్పటికి ఏడుస్తున్నది. తల్లి హృదయం తహతహ కొట్టుకుపోయింది. పిల్లది ఏడుస్తోంది బావురుమని. ఎంతో మంది

అటునుంచి పోతున్నారు. దానివంక చూడట్లేదు. దాన్నెందుకు బాధ పెట్టటం. తను తల్లేనా? తనది హృదయమేనా?

ఏడుపు తనకు కర్ణకఠోరంగా వుంది. ఇంక చూడలేదు. యేమయినా కానీ, పిల్లను తీసుకోవలసిందే తను. తీసుకొని హృదయానికి హత్తుకోవలసిందే! లేచింది. కళ్ళు తుడుచుకుంది. రెండడుగులు వేసింది.

ఆగిపోయింది చటుక్కున. ఒక మనిషి పిల్ల దగ్గర నిల్చుని వున్నాడు. దాని మొహం వంక తదేక దీక్షతో చూస్తున్నాడు. తల్లి అతని వంక పరకాయించి చూసింది. హృదయం ఝల్లుమంది. తనలాంటి మనిషే! ముష్టివాడు. ముష్టివాడు పసిదాన్ని చేతుల్లోకి తీసుకున్నాడు. వాడి మొహం వంక చూచి భయం చేతనో, మరెందుచేతనో ఏడుపు మానివేసింది పిల్ల. నిర్భయంగా భుజం మీద వేసుకున్నాడు. ఒకసారి అటూ యిటూ చూసి గబగబ నడిచి వెళ్ళిపోసాగాడు.

భయంతో, ఆవేశంతో ఉక్కిరిబిక్కిరి అయిపోయింది తల్లి. ఏం జరిగింది? ఏమిటి సంభవించింది? తన ఆశలు!!!

దాన్ని – ఆ బంగారుతల్లిని – అలా రోడ్డు మీద నిర్భయంగా వదిలివేసిన తన కోరిక, ఆశ వ్యర్థమయిపోవలసిందేనా? తన కూతురు లక్షాధికారి యింట్లో సకల సుఖాలు అనుభవించాలనుకున్న తన వాంఛ యిలా నాశనమయి పోవలసిందేనా? ఇలా జరిగిందేం? ఏ డబ్బు గలవాడో ఎందుకు తీసుకుపోకూడదు? తను ప్రక్కన దాక్కుని పొంచి చూస్తుంటే ఈ ముష్టివెధవ, తనలాంటి వాడే తీసుకుపోతాడా బంగారు తల్లిని? పెంచడానికేం తాహతుంది? తనకే లేదే, తనకన్నా వాడేం బాగా పెంచగలడు? తన దగ్గరకన్నా వాడి దగ్గర ఏం సుఖపడుతుంది?

ఏం చెయ్యటం? తన కూతుర్ని తను పెంచుకోలేదా? తన కూతురు తనకు బరువా? అయితే వాడిస్తాడా? తన కూతురని రుజువేమిటి? నిరూపించమంటే?

ముందు చెయ్యవలసింది వాడ్ని అనుసరించటం. వాడిల్లు ఎక్కడో కనిపెడితే తర్వాత ఏదో... ఏమిటో చెయ్యవచ్చు. బయల్దేరింది. నడిచింది పరిగెత్తినట్లు.

ముష్టివాడి అడుగుజాడల్లో, పిల్లజాడ పసిగట్టుకుంటూ నడిచింది. కనిపించాడు. నడక తగ్గించింది మెల్లిగా. తెలియకుండా అనుసరించింది.

చిన్నపాక, పది తాటాకులు వుంటాయి. అక్కడ ఆగాడు ముష్టివాడు, పిల్లను తీసుకుని లోపలకు వెళ్ళిపోయాడు.

ఏడుద్దామనుకుంది తల్లి, గట్టిగా బావురుమని. పసిదానికి ఆకలి వేస్తుందేమో, పాలు ఎలా, వాడింట్లో ఎక్కడ వుంటాయి? ముష్టి వెధవాయే తనలాగే.



## చదివి చూడండి! మీకే తెలుస్తుంది!



ఆ రోజు నాకు బాగా గుర్తు! డాక్టర్‌గారు వస్తూనే 'కథ ఒకటి చెబుతాను, రాస్తావా' అనడిగారు. 'రాస్తానుగాని, ముందు భోంచేయండి' అన్నాను. 'కథ అయిపోనీ. భోంచేస్తాను' అంటూ కథ చెప్పడం ప్రారంభించారు. కళ్ళు మూసుకుని ఆయన కథ చెబుతోంటే నేను రాస్తున్నాను. కథ పూర్తయిపోయింది. ఆయన కళ్ళు తెరిచి కంగారుగా 'ఏంటహల్యా! ఎందుకేడుస్తున్నావు' అనడిగారు. 'కథ బావుందండి' అన్నాను. 'కావాల్సిందదే' అన్నారు. డాక్టర్‌గారు రాసిన చాలా కథల్లో 'మర మనిషి', ఆ తర్వాత ఈ 'తల్లీ-పిల్లా' నాకు నచ్చిన కథలు. ఈ కథ చదివిన ఏ తల్లయినా నాలాగే కంటతడి పెడుతుంది. తల్లే కానక్కరలేదు, ఎవరయినా సరే ఇది చదివి కన్నీళ్ళు పెట్టక తప్పదు. కావాలంటే చదివి చూడండి మీకే తెలుస్తుంది!!

–కొమ్మూరి అహల్యాదేవి

9392573995

తన పిల్లేనని చెబితే? యివ్వడు. దబాయిస్తాడు. బయటికి గెంటుతాడు. లాభం వుండదు.

ఒకటే ఉపాయం. సాయంత్రం దాకా ఎలానో సహించాలి. ఆ తర్వాత వాడింట్లో ఎవరూ లేనప్పుడు చూసి మెల్లిగా పిల్లను తీసుకుని పారిపోవాలి. అంతే!

అంతకు తప్పితే వేరే గత్యంతరం కనిపించలేదు. వాయిదా వేసుకుంది సాయంత్రానికి. వెనక్కి వెళ్ళిపోయింది.

సాయంత్రం కనుచీకటి సమయంలో ఆ తాటాకులు కొంప చుట్టూ తచ్చాడసాగిందా తల్లి. వాడు యింట్లో ఉన్నట్టులేడు. అడుక్కునేందుకు పోయి వుంటాడు. పోతే వాడి పెళ్ళాం. అది బయటకు పోయేవరకు ఎదురుచూస్తోంది. తల్లిహృదయం తల్లడిల్లిపోతున్నది పిల్లను చూడాలని. అమిత ఆతురతతో, ఉదయం నుంచి ఎలా గడిపిందో, ఎక్కడెక్కడ తిరిగిందో తనకే తెలియదు.

ముష్టివాడి పెళ్ళాం బయటికి వచ్చింది. ఏదో పనిమీద ఎటో వెళ్ళిపోయింది. తల్లికి గుండెలు కొట్టుకున్నాయి. ఎలా అయినా యింట్లో దూరాలి. పసిదాన్ని తీసుకోవాలి. ఎత్తుకు పారిపోవాలి.

ప్రొద్దున్న?

ప్రొద్దున్న తను ఏం చేసింది? ఎవరైనా తీసుకుపోవాలని కూతుర్ని వీధిలో విడిచి పెట్టింది. యిప్పుడు తనే తీసుకుపోవాలని ఆందోళన.

అటు యిటూ చూసింది. ఎవరూ కనబడలేదు. ఆలస్యం చెయ్యలేదు. చటుక్కున పరిగెత్తింది. పాకలో దూరింది.

లోపల గ్రుడ్డిదీపం వెలుగుతోంది. ఏదీ? ఎక్కడుంది పిచ్చితల్లి? చూసింది. ప్రక్కన చాపమీద పడుకుని వుంది పిల్ల.

ఆనందంతో వళ్ళు మరిచింది. పసిది తన పిల్లే! ఉత్సాహంగా ముందుకు వంగింది. తన పిల్లను – బంగారు తల్లివి – భోగభాగ్యాలతో తులతూగడానికి ఉద్దేశించబడిన కన్నకూతుర్ని – అదృష్టం లేక ముష్టివాడి ముష్టింట్లో చిక్కుకుపోయిన పసిదాన్ని – తన చేతుల్లోకి తీసుకోడానికి.

కెవ్వుమంది ఒక్కసారిగా. తల తిరిగిపోయింది. గుడ్డి దీపపు వెల్తురు అస్పష్టంగా పిల్ల ఒంటిమీద పడుతున్నది.

కళ్ళు? కళ్ళు ఏమయిపోయాయి? పసిది గ్రుడ్డిదా?

కాళ్ళు? అదేమిటి? అలా వంకర తిరిగిపోయి... కుంటిది కూడానా? 'గొల్లు' మందామె.

★